421) సాళంగనాట / భైరవి

ప॥ జీవుని కేకాలము శ్రీహరి చేరువబంధువు డీతడు ।
భావములోపలిరేపకుడై భక్తి చేకొనును యీతడు ॥

చ॥ పరమున నిహమున వెంటవెంటనే పాయనిబంధువు డీతడు ।
ధర దనుదలచిన మారుకుమారై తా రక్షించును యీతడు ॥
విరివిగ నింద్రియవిషయభోగముల విందులు వెట్టును యీతడు ।
వురుగతి జిత్రపురూపుల దేహపుటుడుగర లిచ్చును యీతడు ॥

చ॥ వడి కలకాలము యిరువదియొక్కటవావులబంధువు డీతడు ।
బడిబడి జైతన్యంబై యిన్నిట బనులకు నొదగును యీతడు ।
జడిగొని యేకాంతలోకాంతమై మతిసంగతి నాప్త డీతడు ।
పొడలుచు వైదికలౌకికకర్మల నొకపొత్తున గుడుచును యీతడు ॥

చ॥ ఘననిధినిక్షేపములిచ్చేటివుపకారిబంధువు డీతడు ।
అనయము వెరవకుమని యేకాలము నభయం బొసగును యీతడు ।
ననిచినశ్రీవేంకటేశ్వరుడై యిటు నాపాల గలుగు నీతడు ।
పనివడి అరులను నూడువట్టి కడు బగసాధించును యీతడు ॥